క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ జాతర



వెంకన్నపాళెంలో గంగమ్మ జాతర ఉత్సవాలు

కోట: మండలంలోని వెంకన్నపాళెంలో గంగమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం మహిళలు పూల బుట్టలు చేతపట్టి దేవతామూర్తులు, గంగపెట్టె, సముద్ర కుంభజలం, మేళతాళాల గ్రామ దక్షిణ పొలిమేర నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. వాటిని అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం గ్రామపొంగళ్లు, గంగమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పంచాయతీలకు నిధులివ్వాలి

కోట: పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని పలువురు సర్పంచులు కోరారు. వారు శనివారం కోటలో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది మార్చిలో 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మే నెల పూర్తవుతున్నా నిధులు విడుదల చేయలేదని వాపోయారు. నిధుల లేమితో పంచాయతీల నిర్వహణ కష్టంగా ఉందన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో క్యాంపస్ సెలక్షన్స్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం మేడిన్ టీ అండ్ డీ కంపెనీ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. బీటెక్ ఫైనలియర్ ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల ద్వారా ఏడుగురిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ తెలిపారు. వారిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

ఆటో బోల్తా



చిట్టమూరు : మండలంలోని చిట్టమూరు చెరువుకట్ట బైపాస్ రోడ్డులో శనివారం ఆటో బోల్తా పడి నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. కొంతమంది బంధువులు ఆటోలో గూడూరు నుంచి నాయుడుపేటకు వెళుతున్నారు. చిట్టమూరు చెరువు వద్ద ఆటో అదుపుతప్పి రోడ్డుపై నుంచి 15 అడుగుల లోతులో ఉన్న పొలాల్లోకి పడిపోయింది. నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలు

సైదాపురం: సైదాపురం- చాగణం మధ్యనున్న రాగనరామాపురం మలుపు వద్ద శనివారం అదుపుతప్పి కారు బోల్తాపడింది. ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారు కండలేరు డ్యామ్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వారిని 108లో గూడూరు ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

చిన్నారులకు ఉచిత ఖత్నాలు



ఖత్నాలు చేసుకున్న చిన్నారులతో నిర్వాహకులు

గూడూరు రూరల్ : గూడూరు రెండో పట్టణంలోని ఆక్సా మసీదులో శనివారం సామూహిక ఉచిత ఖత్నాలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ముస్లిం ధర్మం ప్రకారం ప్రతి ఒక్క బాలుడూ ఖత్నా చేయించుకోవాలన్నారు. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.5 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంత ఖర్చు పెట్టలేని స్థితిలో వున్న పేద పిల్లల కోసం ఉచిత సామూహిక ఖత్నాలు చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో షేక్ చాన్‌బాషా, ఇమామ్ షఫీ, మౌలానా, తమీమ్, కరీముల్లా, జమాలుల్లా పాల్గొన్నారు.

వీణాపాణిగా నృసింహుడు

- హంస వాహనంపై ఊరేగిన దేవదేవుడు
- వైభవంగా క్షేత్రోత్సవం
- తరలి వచ్చిన భక్తజనం



హంస వాహనంపై ఊరేగుతున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమం

రాపూరు : పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామి వారు శనివారం సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించిన హంస వాహనంపై స్వామి వారు సరస్వతిదేవిగా కొలువుదీరారు. అనంతరం కోన మాడవీధుల్లో విహరిస్తూ పారువేట మండపం వరకు క్షేత్రోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను క్రేన్ మండపంలో కొలువుదీర్చి స్నపన తిరుమంజనం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను తిరుచ్చిలో కొలువుదీర్చి వివిధ పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. తదుపరి 1008 సహస్ర దీపాలంకరణ మండపానికి వేంచేపు చేసి ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం స్వామి వారు శ్రీరామచంద్రునిగా హనుమంత వాహనంపై కొలువై పెంచలకోనలోని మాడవీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనివాసులురెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, సోమయ్య, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోమం



హోమం చేస్తున్న కోట సునీల్ స్వామి, పండితులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఉప పీఠంలో శనివారం చక్ర ప్రతిష్ఠతో పాటు మహా రుద్రాభిషేక సహిత హోమం నిర్వహించారు. అళఘనరాథస్వామి ఆలయ సమీపంలోని సాయిసత్సంగ నిలయంలో కోట సునీల్‌కుమార్ స్వామి నేతృత్వంతో హోమం చేపట్టారు. ఇందులో భాగంగా అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. శనిత్రయోదశి సందర్భంగా తైలాభిషేకం చేశారు. శ్రీ మహామృత్యుంజయ అమృత పాశుపత హోమం సైతం చేపట్టారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి

కోట : పాముకాటుకు గురై గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం గూడలి సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆమె ఆలయం వద్ద ఉంటూ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెను శనివారం పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను స్థానికులు 108లో కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ఆమె మృతిచెందింది. ఆమె వివరాలు తెలియక పోవడంతో పంచాయతీ సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు నిర్వహించినట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అంకురార్పణ పూజలు చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం తుమ్మూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి అంకురార్పణలో ప్రారంభమయ్యాయి. టీటీడీకి చెందిన వేదపండితులు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పరిషత్ రక్షా బంధనం, మృత్సంగ్రహణం, వాస్తు హోమ పూజలు చేశారు. అనంతరం స్వామికి ఏకాంత సేవ చేపట్టారు. కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ మహేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి

వాకాడు: భారత్-పాక్ మధ్య దాడులు జరుగుతున్న నేపథ్యంలో సముద్ర తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆదేశించారు. ఆమె శనివారం రాత్రి దుగ్గరాజపట్నం కోస్టల్ మెరైన్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం తీరవాసులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పహల్గామ్ దాడి నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో విద్వేష పూరిత సమాచారాన్ని షేర్ చేస్తేకఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆమె తీర ప్రాంతాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. వాకాడు ఎస్‌ఐ నాగబాబు, మెరైన్ సిబ్బంది, స్థానిక నాయకుడు మహేంద్ర పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

నాయుడుపేట టౌన్ : ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని విన్నమాలకు చెందిన వేనాటి హరిప్రసాద్(28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఇంకా పెళ్లి కాలేదు. మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన అతను శుక్రవారం రాత్రి ఇంట్లో చీరతో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు



ఆకట్టుకుంటున్న అమ్మవారి ముగ్గు

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరులోని అరుంధతీయవాడలో ఉన్న మాతా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న కొలుపులో భాగంగా 4వ రోజు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారిని రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. సాయంత్రం అమ్మవారికి పూజలు చేసి ఒగ్గు కథలు వినిపించారు.

అదుపులోకి వచ్చిన మంటలు



అడవిలో మంటలు ఆర్పిన అటవీశాఖ అధికారులు

చిట్టమూరు : మండలంలోని చిల్లమూరు పంచాయతీ కలుగుర్తిపాడు సమీపంలోని రిజర్వు ఫారెస్టులో శుక్రవారం చెలరేగిన మంటలు అదుపులోకి వచ్చినట్లు బీట్ ఆఫీసర్ హర్షత్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామస్తుల సహకారంతో మంటలను ఆర్పినట్లు తెలిపారు. ఫారెస్టులో విచ్చలవిడిగా మద్యం సేవించి సిగిరెట్లు కాల్చడం వల్లే నిప్పు అంటుకుందన్నారు. శనివారం నుంచి ఐదుగురిని కాపలా ఉంచినట్టు తెలిపారు. వారు అటవీ ప్రాంతంలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి సంఘటనలు జరిగినా అధికారులకు సమాచారం అందజేస్తారని తెలిపారు. గ్రామాల్లో జూదరులకు, కోడి పందెంరాయుళ్లకు, మందు బాబులకు అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేశారు. ప్రజా ప్రతినిధులు తమ వంతు బాధ్యతగా అటవీ సంపదను కాపాడుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కొద్ది రోజుల క్రితమే ఫారెస్టులో 20 హెక్టార్లలో ఎర్రచందనం, మరో 30 హెక్టార్లలో అవకోడా మొక్కల పెంపకం చేపట్టామన్నారు.



నేడు పెంచలకోనలో గరుడ వాహనం

రాపూరు : పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు శ్రీవారికి పూలంగి సేవ, ఉదయం 8 గంటలకు సింహ వాహనం, మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి 11 గంటలకు గరుడ వాహనం నిర్వహించనున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటును విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గూడూరు రూరల్ : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం గూడూరులోని పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి, సబ్బరామరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం రైతుల ఆందోళన

- రోడ్డుపై టెంటు వేసి బైఠాయింపు
- జీవితాలతో చెలగాటం ఆడొద్దని హితవు



రోడ్డుపై బైఠాయించిన బాధిత రైతులు

నాయుడుపేట టౌన్ : సాగరమాల రోడ్డు కోసం తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. వారు శనివారం నాయుడుపేట మండలం కాపులూరు సమీపంలో సాగరమాల రోడ్డు పనులను అడ్డుకున్నారు. రోడ్డులో టెంటు వేసుకుని వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వారు మాట్లాడుతూ 26 మంది రైతులకు సంబంధించి సర్వే నంబరు 102, 111లో 10 ఎకరాలకు పైగా భూమిని ప్రభుత్వం రెండేళ్ల క్రితం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కొంత పరిహారం ఇచ్చారని, ఇంకా రూ.కోటికి పైగా అందజేయాల్సి ఉందని తెలిపారు. వ్వకుండా తమ జీవితాలతో చెలగాటం ఆడుతోందని దుయ్యబట్టారు. ఈ నెల 10వ తేదీలోపు పరిహారం ఇస్తామని గత నెల 30వ తేదీన తహసీల్దార్ రాజేంద్ర హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజేంద్ర కాపులూరు చేరుకుని రైతులతో మాట్లాడారు. సోమవారం జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ వద్దకు రైతులను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తమకు న్యాయం జరగకపోతే వందల మంది రైతులతో కలిసి సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రైతులు స్పష్టం చేశారు.

కనుల పండువగా పల్లకీ సేవ



పల్లకిలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు : కలువకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజు శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి ఊరేగించారు. తదుపరి తిరుచ్చి ఉత్సవం, నవకలశ స్నపనం చేపట్టారు. మధ్యాహ్నం ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమానికి గూడూరుకు చెందిన సీఆర్‌రెడ్డి హాస్పిటల్ వైద్యులు జనార్దనరెడ్డి, రోహిణి ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం జరిగిన కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వరగలికి చెందిన మూగా శంకరయ్య, హైమావతి, మంగళపూరుకు చెందిన పెరికల గోపాలయ్య, సుబ్బమ్మ వ్యవహరించారు. పొన్నవోలు గ్రామానికి చెందిన పండరి భజన గురువు టీవీ క్రిష్ణదాసు బృందం పండరి భజన అలరించింది.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు



చిల్లకూరు : ఆపరేషన్ సందూర్‌లో భారత సైనికులు విజయం సాధించాలని కోరుతూ శనివారం తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీర మరణం పొందిన జవాన్‌కు నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారు మాట్లాడుతూ దాయాది దేశమైన పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తోందని ఆరోపించారు. వారికి మన సైనికులు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సతీష్‌యాదవ్, బక్తాని రామయ్య, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.